క్లుప్తంగా

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ



విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్లు

మూసాపేట: ఫతేనగర్ డివిజన్ పరిధిలోని ప్రభాకర్ రెడ్డి నగర్‌లో ఆంజనేయ స్వామి ఆలయం పునర్నిర్మాణం అనంతరం విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఆదివారం జరిగింది. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఫతేనగర్ డివిజన్ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్, కూకట్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ జూపల్లి సత్య నారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు కేసీఆర్ జన్మదిన వేడుకలు

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ సబిహా బేగం ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 9.30 గంటలకు పర్వత్‌నగర్ ప్రభుత్వ పాఠశాల వద్ద బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ జన్మదిన వేడుకలు నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ డివిజన్ కో ఆర్డినేటర్ వీరా రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేడు ప్రజావాణి

కుత్బుల్లాపూర్: జంట సర్కిళ్ల పరిధిలో సోమవారం ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు కుత్బుల్లాపూర్, గాజులరామారం సర్కిళ్ల ఉప కమిషనర్లు నరసింహ, మల్లారెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎనిమిది డివిజన్లకు సంబంధించిన ప్రజలు తమ ప్రాంతంలో నెలకొన్న డ్రైనేజీ, మంచినీరు, ఇతర సమస్యల పరిష్కారానికి ఫిర్యాదు చేయాలని సూచించారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

ఎంపీ ఈటల రాజేందర్



ఎంపీ రాజేందర్‌తో డబుల్ బెడ్‌రూమ్ లబ్ధిదారులు

దుండిగల్: డబుల్ బెడ్‌రూం సముదాయాల వద్ద మౌలిక సదుపాయాలు కల్పించేందుకు తనవంతు కృషి చేస్తానని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. దుండిగల్ మున్సిపాలిటీ గండిమైసమ్మలోని డబుల్ బెడ్‌రూం సముదాయాలు 3, 5, 8 బ్లాకుల వద్ద బోర్లు వేయాలని లబ్ధిదారులు ఆదివారం కలిసి విన్నవించారు. వెంటనే స్పందించిన ఎంపీ.. సంబంధిత అధికారులకు ఫోన్ చేసి బోర్లు వేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ మున్సిపాలిటీ అధ్యక్షుడు పీసరి కృష్ణారెడ్డి, కాలనీ వాసులు గణేష్, మధు, శ్రీనివాస్, లత, జయమ్మ, ఆర్‌పీ లక్ష్మి, హసీనా, రఫ్రీన్ బేగం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రేణుకా ఎల్లమ్మ రజతోత్సవాలు

కుత్బుల్లాపూర్: గాజులరామారంలోని రేణుకా ఎల్లమ్మ దేవి రజతోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచే భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు క్యూ కట్టారు. పెద్ద సంఖ్యలో మహిళలు బోనాలతో తరలి వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ ఎల్లమ్మ తల్లిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో సహదేవ్, పెరిమాల రవి, నర్సింగ్‌రావు, సురేష్, పెరిమాల రాజేష్, చిత్తా రమ్మ ఆలయ కమిటీ చైర్మన్ అంతయ్యగౌడ్, ఇంద్రసేనారెడ్డి, బాలరాజ్, చౌడ శ్రీనివాస్, నాగిళ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ఎంపీ సంజీవరెడ్డి పుట్టిన రోజును ఆదివారం ఘనంగా నిర్వహించారు. భ్రమరాంబ మల్లికార్జున స్వామి ప్రధాన అర్చకులు అఖిలేశ్వర శర్మ బృందం ఆదివారం ఆయన నివాసంలో వేద మంత్రాలతో ఆశీర్వదించారు. పలువురు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.
-ఆల్విన్‌కాలనీ

అధ్వానం.. అంతర్గత రహదారులు

మూసాపేట డివిజన్ అంతర్గత రహదారులు అధ్వానంగా ఉన్నాయి. ఎక్కడ చూసిన గుంతల రోడ్లే దర్శనమిస్తున్నాయి. అభివృద్ధి పేరిట రోడ్లను తవ్విన అధికారులు ఆ తరువాత వాటికి మరమ్మతులు చేయకుండా అలాగే వదిలేశారు. ఆయా ప్రాంతాల్లో ప్రమాదాలు జరుగుతున్నా మరమ్మతులు చేయడం లేదని అధికారుల తీరుపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



జనతానగర్‌లో..

- గుంతల రోడ్లతో వాహనదారులకు తిప్పలు
- మరమ్మతులకు నోచుకోని వైనం
- అధికారుల తీరుపై ప్రజల ఆగ్రహం



ప్రభుత్వ బాలుర పాఠశాల ముందు ప్రధాన రహదారి



జనతానగర్‌లో అయ్యప్ప ఆలయానికి వెళ్లే దారిలో..

మూసాపేట: మూసాపేట డివిజన్ పరిధిలోని అంతర్గత రహదారులు గుంతలమయంగా మారాయి. అభివృద్ధి పేరిట తవ్విన అధికారులు మళ్లీ మరమ్మతులు చేయకపోవడంతో రాకపోకలకు, స్థానికులకు ఇబ్బందిగా మారింది. ఇళ్ల ముందు చిన్నారులు ఆడుకునే సమయంలో కూడా కిందపడి గాయాల పాలవుతున్నారు. పలుమార్లు ఉన్నతాధికారులకు విన్నవించినా పట్టించుకోవటం లేదని స్థానిక ప్రజలు వాపోతున్నారు. జనతానగర్‌లోని అయ్యప్ప స్వామి ఆలయానికి వెళ్లే దారిలో రోడ్డుకు అడ్డంగా గోతులు ఉన్నాయి. గత రెండు సంవత్సరాలుగా గోతులు ఇలాగే ఉన్నా అధికారులు పట్టించుకోవటం లేదు. మరమ్మతులు చేయాలని, రాకపోకలకు ఇబ్బందిగా ఉందని విన్నవించినా అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడం లేదు. జనతానగర్‌లోని వడ్డెర బస్తీలో, యాదవ బస్తీలోని పలు చోట్ల అభివృద్ధి పేరిట తవ్వి మళ్లీ మరమ్మతులు చేయటం మరిచారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి రోడ్లకు మరమ్మతులను చేయాలని కోరుతున్నారు.

వెలగని లైట్లు.. కమ్ముకున్న చీకట్లు!

- ధరణినగర్‌లో నెల రోజులుగా వెలగని వీధి దీపాలు



వీధి లైటు వెలగకపోవడంతో చీకటిమయంగా మారిన ధరణినగర్

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ ధరణినగర్‌లోని వివిధ వీధుల్లో వీధి లైట్లు వెలగడం లేదు. కాలనీలో వీధి దీపాలు సుమారు నెల రోజుల నుంచి వెలగకపోవడంతో కాలనీలోని అంతర్గత రహదారులు చీకటిమయంగా ఉంటున్నాయి. దొంగల బెడద, కుక్కల బెడద, పోకిరీల బెడదతో కాలనీవాసులు భయాందోళన చెందుతున్నారు. ధరణినగర్‌కు ఆనుకుని పరికి చెరువు నాలా ప్రవహిస్తుంది. నాలాలో విషపురుగులు, సర్పాలు సంచరిస్తుంటాయి. కొద్ది రోజుల క్రితమే ఆల్విన్‌కాలనీ పరిసర ప్రాంతాల్లోని కాలనీల్లో కొండ చిలువ వంటి భారీ పాములు కనిపించిన సంఘటనలు ఉన్నాయి. పాములను పట్టుకునే వారిని పిలిపించారు. స్థానికంగా కూడా దొంగల బెడద ఎక్కువగా ఉంటుంది. ఇదే ప్రాంతంలో ద్విచక్ర వాహనాలు, పాలప్యాకెట్లు, నూతనంగా నిర్మించే ఇళ్లల్లో చొరబడి ఎలక్ట్రికల్, కలర్స్ డబ్బాలు, ఇతర విలువైన సామగ్రిని అపహరించిన ఘటనలు కూడా ఉన్నాయి. వీధి దీపాలు వెలగక పోవటంతో సీసీ కెమెరాల్లో కూడా ఏమీ కనిపించకపోవటంతో అటు వైపు వచ్చిన వారిని కూడా గుర్తించటం కష్టంగా ఉంటుందని కాలనీ వాసులు పేర్కొంటున్నారు. కాలనీలోని శ్రీకనకదుర్గమ్మ దేవాలయం ప్రాంగణం, హైటెన్షన్ రోడ్డు, కాలనీ ప్రధాన రహదారులు, వీధుల్లో లైట్లు కూడా వెలగక పోవటంతో కాలనీ వీధులన్నీ రాత్రి చీకటిగా మారుతున్నాయి. అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవటం లేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన



మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ వివేకానందనగర్‌లో వెంకట్రావు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన చూపరులను ఆకట్టుకుంది. ప్రతిభ చూపిన చిన్నారులను సన్మానించి బహుమతులు అందజేశారు. చిన్నారులను ప్రోత్సహిస్తే ఉన్నత స్థాయికి చేరుకుంటారని అతిథులు తెలిపారు. కార్యక్రమంలో ముమ్మారెడ్డి ప్రేమ కుమార్, కొల్లా శంకర్, అడపాల షణ్ముఖ, పవన్ నాయుడు, పోలబోయిన శ్రీనివాస్, రాము తదితరులు పాల్గొన్నారు.

ఓమ్ని ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తదితరులు



బిపి కియోస్క్‌ను ప్రారంభించి వాకర్స్‌కు వివరిస్తున్న ఎమ్మెల్యే

కూకట్‌పల్లి: బాలాజీనగర్ కమ్యూనిటీ హాల్‌లో ఓమ్ని ఆసుపత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆదివారం ప్రారంభించారు. సూపర్ స్పెషాలిటీ వైద్యులు ఆర్థోపెడిక్స్, జనరల్ మెడిసిన్, స్పైన్ సర్జన్, గైనకాలజీ, ప్రాథమిక పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఓమ్ని ఆసుపత్రి సీఓఓ డాక్టర్ వారిస్, జీఎం శ్రీనివాస్, సుభాష్ గౌడ్, నాగరాజు, ఆరోగ్య రెడ్డి, జస్వంత్, ఆసిఫ్‌ఖాన్, కృష్ణారెడ్డి, అశోక్, సావిత్రి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బిపి కియోస్క్ ప్రారంభం

నల్ల చెరువు పార్కులో ఆటోమేటిక్ బిపి కియోస్క్‌ను ఆదివారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నల్ల చెరువు పార్కులో ఉదయం వాకింగ్ చేసుకునే వారికి అపాయింట్‌మెంట్ అవసరం లేకుండా తమ రక్తపోటును త్వరగా, సులభంగా తనిఖీ చేయటంలో సహాయ పడతాయన్నారు. అధిక రక్తపోటు గురించి అవగాహన పెంచటంలో ఇవి సహాయ పడతాయని హోలిస్టిక్ హాస్పిటల్ సీనియర్ కార్డియాలజిస్ట్ ఎండీ వి.ఎస్. రామచంద్ర తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, మార్కెటింగ్ మేనేజర్ చంద్ర శేఖర్, సంతోష్, ప్రభాకర్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

రాణా ప్రతాప్‌నగర్‌లో వసతులు కల్పిస్తాం

కార్పొరేటర్ సబిహా బేగం



సంక్షేమ సంఘం నూతన కార్యవర్గ సభ్యులతో కార్పొరేటర్ సబిహా బేగం

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ రాణా ప్రతాప్ నగర్ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని కార్పొరేటర్ సబిహా బేగం సమక్షంలో ఆదివారం ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షులుగా మాధవాచారి, ప్రధాన కార్యదర్శిగా సాంబయ్య, కోశాధికారిగా శ్యామ్ సుందర్ రెడ్డి, చైర్మన్‌లుగా రవీందర్ గౌడ్, లింగం, వైస్ ప్రెసిడెంట్‌గా రాజయ్య చారి, బాబా, శంకర్, గఫూర్, జాయింట్ సెక్రటరీలుగా ఆకుల అనిల్ కుమార్, జహంగీర్ బాబా, నిజాం, ఉమర్, కిష్టారెడ్డి ఎన్నికయ్యారు. రాణా ప్రతాప్ నగర్‌లో నూతన బోర్ వాటర్ కోసం మోటార్ బిగించామని కార్పొరేటర్ తెలిపారు. మిగిలిన పెండింగ్ పనులను కూడా త్వరలో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డివిజన్ కో ఆర్డినేటర్ వీరా రెడ్డి, జ్ఞానేశ్వర్, మల్లికార్జున్, రాంరెడ్డి, యోగి, పార్వతమ్మ, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

‘స్థానిక’ సమరానికి సన్నద్ధం!

నోటిఫికేషన్ రావడమే తరువాయి

- రంగంలోకి అధికార యంత్రాంగం
- నగర శివారు మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల్లో 580 గ్రామ పంచాయతీలు
- మేడ్చల్ జిల్లాలో 34 జీపీల్లో ఎన్నికలపై రాజకీయ వర్గాల్లో భిన్నాభిప్రాయాలు



సాక్షి,సిటీబ్యూరో: స్థానిక సంస్థల ఎన్నికలకు అధికార యంత్రాంగం సన్నద్ధమవుతోంది. షెడ్యూల్ విడుదలైన వెంటనే తీసుకోవాల్సిన చర్యలపై కసరత్తు చేస్తోంది. ఇప్పటికే గ్రామాలు, వార్డుల వారీగా ఓటరు జాబితా సిద్ధం చేయడంతో పాటు పోలింగ్ కేంద్రాల గుర్తింపుతో సహా రిటర్నింగ్ అధికారులకు మొదటి విడత శిక్షణ సైతం పూర్తి చేశారు. ఇదిలాఉంటే త్వరలో కొత్త సర్పంచ్‌లు వస్తారని ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలతో రాజకీయ పార్టీల ప్రతినిధులు ఓటర్లను ఆకట్టుకునే పనిలో నిమగ్నమయ్యారు. నగర శివారు మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లో 580 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇందులో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 34 జీపీలు ఉండగా, 66,044 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 33,150 మంది పురుషులు ఉండగా, 32,893 మంది మహిళా ఓటర్లు, ఇతరులు ముగ్గురు ఉన్నారు. 34 జీపీల పరిధిలో 320 వార్డులు ఉండగా, 320 పోలింగ్ కేంద్రాలను సైతం ఖరారు చేసి ఎన్నికల సామగ్రిని సైతం మండలాల వారీగా పంపిణీ చేస్తున్నామని పంచాయతీ శాఖ వర్గాలు పేర్కొంటున్నాయి.

వ్యూహాలకు పదును..

స్థానిక సమరంలో పార్టీల గుర్తులు లేకపోయినా అభ్యర్థిని బట్టే ప్రజలు ఓటేస్తారు. అయితే కాంగ్రెస్ ఆశావహులు ఆరు గ్యారంటీలతో ప్రజల్లోకి వెళ్లనుండగా, మరోవైపు బీఆర్ఎస్ మద్దతుదారులు ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని రెడీగా ఉన్నారు. రిజర్వేషన్లు ఎలా ఉన్నా మాజీ ప్రజాప్రతినిధులు తమ కుటుంబీకులను నిలపాలని ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. ఈసారి పట్టు బిగిస్తే రాబోయే ఎన్నికల నాటికి బలోపేతం కావాలన్నది బీజేపీ వ్యూహంగా కనిపిస్తోంది.

- బీసీ రిజర్వేషన్లు పెంచాలనే ఉద్దేశంతో ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే ముగిసి, డేటా ఎంట్రీ కూడా పూర్తయ్యింది. అయితే మళ్లీ రిజర్వేషన్లను కొత్తగా ఖరారు చేయనుండడంతో మార్పులు జరిగే అవకాశం ఉండడంతో ఆశావహుల్లో ఉత్కంఠ పెరిగింది.

ఎన్నికలకు యంత్రాంగం రెడీ..

ఈసీ ఆదేశాల మేరకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తున్నప్పటికీ మేడ్చల్ జిల్లాలోని రాజకీయ వర్గాల్లో మాత్రం భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 5 మండలాల పరిధిలో 62 జీపీలు ఉండగా, ప్రభుత్వం ఇటీవల తీసుకున్న నిర్ణయంలో భాగంగా 28 పంచాయతీలు సమీపంలోని ఏడు మున్సిపాలిటీల్లో విలీనమయ్యాయి. దీంతో కీసర, ఘట్‌కేసర్ మండలాలు పూర్తిగా అర్బన్ ప్రాంతాలుగా రూపాంతరం చెందాయి. మేడ్చల్, శామీర్‌పేట్, మూడుచింతలపల్లి మండలాల పరిధిలోని 34 గ్రామాలు మాత్రమే పంచాయతీలుగా మిగిలిపోయాయి. మేడ్చల్ మండలంలో 14 పంచాయతీల్లో 22,675 మంది ఓటర్లు ఉండగా, 126 వార్డులు ఏర్పాటు చేశారు. మూడుచింతలపల్లి మండలంలో 13 పంచాయతీల్లో 20,910 మంది ఓటర్లు ఉండగా, 122 వార్డులు, శామీర్‌పేట మండలంలో ఏడు పంచాయతీల్లో 22,459 మంది ఓటర్లు ఉండగా, 72 వార్డులు ఏర్పాటు చేశారు. మొత్తంగా 3 మండలాల పరిధిలోని 34 పంచాయతీల్లో 320 వార్డులు ఉండగా వార్డుకొకటి చొప్పున 320 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసింది.

ఎంపీటీసీ ఎన్నికలకూ..

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 15 మండలాలు ఉండగా, ఇందులో 3 మండలాలు మాత్రమే రూరల్ ప్రాంతంగా ఉన్నాయి. వీటి పరిధిలోని 19 ఎంపీటీసీ స్థానాలకు కూడా ఎన్నికలు నిర్వహించేందుకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. మేడ్చల్ మండలంలో 7 ఎంపీటీసీ స్థానాలకు సంబంధించి 48 పోలింగ్ కేంద్రాలు , శామీర్‌పేట మండలంలో 6 స్థానాలకు 45, ఎంసీపల్లి మండలంలో 6 స్థానాలకు 45 పోలింగ్ కేంద్రాలను ఖరారు చేసింది.

మేడ్చల్ జిల్లాలో ఎన్నికలపై భిన్నాభిప్రాయాలు

మేడ్చల్ జిల్లాలో రూరల్ ప్రాంతంగా మిగిలిన 3 మండలాల పరిధిలో 34 జీపీలు ఉన్నాయి. అయితే వీటిని కూడా ప్రభుత్వం 3 లేదా 4 మున్సిపాలిటీలుగా ఏర్పాటు చేయనున్నదనే ప్రచారం రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతోంది. ఈ నేపథ్యంలో జిల్లాలో అసలు స్థానిక సంస్థల ఎన్నికలు ఉంటాయా..? లేదా అని సందేహాలు, భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఒకవేళ సర్కారు జిల్లాలోని 34 గ్రామ పంచాయతీలను మున్సిపాలిటీలుగా ఏర్పాటు చేస్తే మాత్రం స్థానిక ఎన్నికలు లేనట్టేనని చెప్పొచ్చు. అదిగాకుండా పంచాయతీలుగానే కొనసాగించాలని భావిస్తే మాత్రం ఎన్నికలు ఉంటాయన్న చర్చ జరుగుతోంది.

పొంగిన డ్రైనేజీ.. రోడ్డంతా బురదమయం



మోతీనగర్ ప్రధాన రోడ్డుపై పొంగిపొర్లుతున్న డ్రైనేజీ నీరు

ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు

మోతీనగర్: మూసాపేట డివిజన్ మోతీనగర్ ప్రధాన రోడ్డుపై డ్రైనేజీ పొంగిపొర్లటంతో రోడ్డంతా బురదమయంగా తయారైంది. దీంతో మురుగునీరు ఈసేవా వరకు ప్రవహిస్తున్నాయి. అసలే ఆ రోడ్డు వాహనాలతో రద్దీగా ఉంటుంది. మురుగునీరుపై వాహనాలు వెళ్లటంతో పాదాచారులపై పడుతున్నాయి. దీంతో చిన్నపాటి గొడవలు కూడా జరుగుతున్నాయి. అంతేకాకుండా దుర్గంధం, దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు. పలుమార్లు సంబంధిత అధికారులకు సమస్యను వివరించినా పట్టించుకునే నాథుడే లేడు. ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి డ్రైనేజీకి శాశ్వత మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



పెండింగ్ పనులను పూర్తి చేస్తాం

ఎమ్మెల్యే వివేకానంద్



ఎమ్మెల్యే వివేకానంద్‌కు హారతులతో స్వాగతం పలుకుతున్న మహిళలు

కుత్బుల్లాపూర్: ఏ ప్రభుత్వమైనా ప్రజా సంక్షేమం కోసమే పనిచేయాలని బీఆర్ఎస్ శాసనసభ విప్, ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. ఆదివారం జీడిమెట్ల డివిజన్ జయరామ్‌నగర్‌లో రూ.90 లక్షలతో పూర్తిచేసిన సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ చెరుకుపల్లి తారాచంద్రారెడ్డితో కలిసి ప్రారంభించారు. స్థానికులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరలోనే పూర్తి చేస్తామని, ప్రజలకు సుపరిపాలన అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని తెలిపారు. అభివృద్ధి పనుల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములవ్వాలన్నారు. కార్యక్రమంలో సంక్షేమ సంఘం అధ్యక్షుడు కుంటి మల్లేష్, ప్రధాన కార్యదర్శి మన్నే హరినాథ్, ఉపాధ్యక్షుడు లింగ భిక్షపతి, చైర్మన్ నరసింహ, కోశాధికారి చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

- గాజులరామారం మెట్‌కానిగూడలోని మల్లికార్జున స్వామి జాతరకు ఎమ్మెల్యే హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, బీఆర్ఎస్ ఆయా డివిజన్‌ల అధ్యక్షులు విజయరామిరెడ్డి, పోలే శ్రీకాంత్, సీనియర్ నాయకుడు కస్తూరి బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.